క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): స్థానిక మార్కండేయ ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ 62వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం మృత్యుంజయ హోమం నిర్వహించారు. అన్నదానం, సాయంత్రం పల్లకి సేవా జరిపారు. పద్మశాలి ప్రతినిధులు పురుషోత్తం, రాజేశం, బాలరాజు, శ్రీనివాస్, ఉష, కోయిల, గణేశ్, పండితులు కృష్ణమూర్తి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వయం పాలన



ఉపాధ్యాయులతో విద్యార్థులు

మిరుదొడ్డి(దుబ్బాక): స్థానిక ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. హెచ్‌ఎంగా అవంతిక, డీఈఓగా నారాయణరావు, ఎంఈఓగా ప్రదీప్, స్పెషల్ ఆఫీసర్‌గా అభిలాష్, టీచర్లుగా పూజ, శృతి, దేవి, అక్షిత, క్రితిక, హారిక తదితరులు వ్యవహరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు హెచ్‌ఎం పద్మావతి, టీచర్లు రమేశ్, శ్రీనివాస్, తిరుపతి రెడ్డి, శ్రీదేవి, స్వామిలు బహుమతులు ప్రదానం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న స్నేహితులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో అటెండర్‌గా సేవలందించిన బాలకిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొన్న పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేసి అండగా నిలిచారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని మోతె గ్రామానికి చెందిన ఆయన కాంట్రాక్టు పద్ధతిపై 35 యేళ్లుగా సేవలందించాడు. 2005లో ఏడోతరగతి చదివిన స్నేహితులు మంగళవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.6 వేల ఆర్థిక సాయం అందించారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

మద్దూరు(హుస్నాబాద్): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ప్రొవిజనల్ లిస్టుకు ధూళ్మిట్ట ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయినట్లు హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కొలిపాక సంజన, ఎర్రశృతి, ప్రణయ్‌కుమార్ ఎంపికయ్యారని, వారికి ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకు ప్రతియేటా రూ.12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందించనున్నట్లు తెలిపారు. కృషిచేసిన ఉపాధ్యాయులు వెంకటయ్య, నాగరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సమత, సురేందర్‌రెడ్డి, రాములు, రంజిత్‌కుమార్‌ను హెచ్‌ఎం అభినందించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ హౌజింగ్ బోర్డు కాలనీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. హౌజింగ్‌బోర్డు కాలనీ, హరిప్రియ నగర్, టీచర్స్ కాలనీ, ఎస్‌ఆర్ నగర్, ఎంఎల్‌ఏ క్యాంప్ ఆఫీస్, ప్రియదర్శిని, మీనాక్షి కాలనీలలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

మండల మహిళ అధ్యక్షురాలి ఎంపిక



నియామక పత్రం అందుకుంటున్న భార్గవి

కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మండల మహిళ అధ్యక్షురాలిగా బుడిగే భార్గవి ఎంపికయ్యారు. సిద్దిపేటలో జిల్లా మహిళ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి మంగళవారం ఆమెకు నియామక పత్రం అందించారు. తన ఎన్నికకు సహకరించిన వారికి భార్గవి ధన్యావాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ ప్రధానకార్యదర్శి రేష్మ, రాష్ట్ర కార్యదర్శి చెరుకు సుమలత తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనం వద్దు

ప్రభుత్వానికి లక్షలాది రూపాయల ఆదాయం అందిస్తున్న తహసీల్దార్ కార్యాలయం ఎనిమిదేళ్లుగా అద్దె భవనంలోనే కొనసాగుతోంది. మండల కేంద్రంగా 2016లో ఏర్పాటైనప్పటి నుంచి ఆ కార్యాలయం కిరాయి ఇంట్లోనే అరకొర వసతుల మధ్య నెట్టుకొస్తున్నారు. ప్రస్తుతం కిరాయికి ఉన్న ఇంటికి నెలకు రూ.10వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. దాదాపు మూడేళ్లుగా ఇంటి యజమానికి అద్దె డబ్బులు బకాయి పడింది. సిబ్బంది ఇరుకు గదులలో అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు.

- 8 యేళ్లుగా కిరాయి భవనంలోనే తహసీల్దార్ కార్యాలయం
- ప్రభుత్వానికి భారం.. ఉద్యోగులకు అసౌకర్యం
- పట్టించుకోని ఉన్నతాధికారులు



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

అక్కన్నపేట(హుస్నాబాద్): తహసీల్దార్ కార్యాలయం మొదటి గదిలో తహసీల్దార్, ధరణి ఆపరేటర్, రెండో గదిలో సీనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, మూడో గదిలో జూనియర్ అసిస్టెంట్, ఆర్ఐ, నాలుగో గదిలో రికార్డులను భద్రపరచడానికి వినియోగిస్తున్నారు. వరండాలో తాత్కాలికంగా రేకుల షెడ్డు ఏర్పాటుచేసి దానిని ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లకు కేటాయించారు. ఏదైనా పనిపై వస్తే కూర్చోడానికి కూడా వీలు ఉండటం లేదని ప్రజలు వాపోతున్నారు.

సిబ్బందికి ఇబ్బందులు

మంత్రి పొన్నం ప్రభాకర్ ఇలాకాలో కూడా ప్రభుత్వ కార్యాలయాలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వాటిల్లో వసతులు లేక సిబ్బంది, పనుల కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, వ్యవసాయ, నీటి పారుదల తదితర కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించలేదు. మండల స్థాయి సమావేశాలకు రైతు వేదికను వినియోగించుకుంటున్నారు.

స్థలం గుర్తించినా..

మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 387లో సమీకృత భవనాల నిర్మాణానికి దాదాపు 15 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. ఇటీవల మండల పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరైనట్లు అధికారులు తెలిపారు. కానీ భవన నిర్మాణ పనులు మొదలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని శిథిలావస్థకు చేరిన నాలుగు తరగతి గదులకు మరమ్మతులు చేయించి అసౌకర్యాల నడుమ మండల పరిషత్ కార్యాలయాన్ని నెట్టుకొస్తున్నారు. ఇకనైనా మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్ దృష్టిసారించి సొంత భవనాలను నిర్మించాలని ప్రజలు, సిబ్బంది కోరుతున్నారు.

వసతులు లేవు



ప్రస్తుతం ఉన్న కిరాయి ఇంటికి నెలకు రూ.10వేలు చెల్లిస్తున్నారు. మూడేళ్లుగా బకాయిపడ్డ కిరాయి ఇమ్మని ఆ ఇంటి యజమాని నిత్యం గోలపెడుతున్న పరిస్థితి. పక్కనే ఉన్న మండల వనరుల భవనం(ఎంఆర్‌సీ)లో తహసీల్దార్ కార్యాలయం నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలని ఆర్డీఓకు విన్నవించుకున్నాం. త్వరలోనే మంత్రి పొన్నం దృష్టికి కూడా తీసుకెళ్తాం.

- అనంతరెడ్డి, తహసీల్దార్



బోనాలతో వస్తున్న భక్తులు

కొండపోచమ్మ సన్నిధిలో భక్తుల సందడి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. నాలుగో వారం కావడంతో కొమురెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు ఆలయాన్ని సందర్శించారు. డప్పుళ్ల చప్పుళ్ల మధ్య బోనాలతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి నేవైద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

దొంగలు ఉంటారు జాగ్రత్త..

కొండపోచమ్మ దర్శనానికి వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని, దొంగలు ఉంటారని ఎస్ఐ చంద్రమోహన్ సూచించారు. కనువిప్పు కార్యక్రమంలో భాగంగా సోమవారం రాత్రి మండలంలోని తిగుల్‌నర్సాపూర్, కొండపోచమ్మ ఆలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కళాకారులు తమ పాటలు, నృత్యాలతో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జాతరలో ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత రమేశ్, నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ చంద్రమోహన్

పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయండి

ఎంపీడీఓకు గ్రామస్తుల వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ పంచాయతీ కార్యదర్శి అవినీతికి పాల్పడుతున్నాడని, అతడిని వెంటనే సస్పెండ్ చేయాలని పలువురు గ్రామస్తులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం సీపీఎం నాయకుడు ఇస్తారి ఆధ్వర్యంలో ఎంపీడీఓ శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంచాయతీ కార్యదర్శి బంగారి బాల్‌రాజు ఇంటి పన్నులు వసూలుచేసి ట్రెజరీలో జమ చేయకుండా సొంతానికి వాడుకున్నాడని మండిపడ్డారు. నూతన గృహాల అనుమతి విషయంలో ఇంటి యజమానులను వేధిస్తున్నాడని వాపోయారు. డబ్బులిస్తేనే అనుమతులు ఇస్తానని చెబుతున్నాడని, ఎవరైనా ఫిర్యాదుచేస్తే వారికి ఫించన్, సంక్షేమ పథకాలు నిలిపివేసి కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత కాలంగా సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, గతంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. సొంతానికి వాడుకున్న నిధులను వెంటనే రికవరీచేసి అతడిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయిలు, రాజు, యాదగిరి, ఎల్లయ్య, ఎండీ గోరేమియా, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

- ప్రతి గ్రామంలోనూ ఏర్పాటు చేసుకోవాలి
- పోలీసు అధికారులు

బెజ్జంకి(సిద్దిపేట)/కొమురవెల్లి(సిద్దిపేట): నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, ఎస్ఐలు రాజు, కృష్ణారెడ్డి సూచించారు. బెజ్జంకి పోలీస్ స్టేషన్‌లో సీఐ శ్రీను మంగళవారం ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలను అదుపు చేయడానికి సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని, వాటి ఏర్పాటు కోసం గ్రామాల వీపీఓలను నియమిస్తున్నామన్నారు. తన సర్కిల్‌లో బెజ్జంకి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాలను స్వయంగా ఏర్పాటు చేసుకునేలా ఉద్యోగ, వ్యాపార వర్గాలకు చైతన్యం కల్పించాలని సిబ్బదికి సూచించారు. నెల రోజులలో మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శభాశ్‌గూడెం, అయినాపూర్ గ్రామాలలో ఎస్ఐ రాజు సందర్శించి గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. అలాగే పనిచేయని కెమెరాల స్థానంలో నూతన కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ రాజమల్లు, సిబ్బంది పాల్గొన్నారు.



బెజ్జంకి(సిద్దిపేట): సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

ఆకునూరులో..

చేర్యాల(సిద్దిపేట): ప్రజల రక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ పి.నీరేశ్ సూచించారు. మండల పరిధిలోని ఆకునూరులో అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చాలా అవసరమన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లి దండ్రులకు ఉంటుందని చెప్పారు. గ్రామంలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేసినా, అనుమానాస్పదంగా కనిపించినా వెంటనే 100కి కాల్‌చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొబెషనరీ ఎస్ఐ మానసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

చేర్యాల సీఐ శ్రీను

మద్దూరు(హుస్నాబాద్): ఎన్నికలు వస్తుంటాయి పోతుంటాయి, వాటిని అడ్డుపెట్టుకొని గొడవలకు దిగకుండా శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని చేర్యాల సీఐ శ్రీను సూచించారు. మండలంలోని మర్మాముల గ్రామంలో మంగళవారం సైబర్ నేరాలు, సీసీ కెమెరాలు, మత్తు పదార్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

అక్కన్నపేట(హుస్నాబాద్): యువత గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఏఎస్ఐ రామ్మూర్తి పిలుపునిచ్చారు. మండలంలోని మల్లంపల్లి ఉన్నత పాఠశాలలో మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రంగానాయక్, ఉపాధ్యాయులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.



కోహెడరూరల్(హుస్నాబాద్): అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ రామ్మూర్తి

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు: సీఐ

గజ్వేల్‌రూరల్: మద్యం తాగి వాహనాలు నడపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ట్రాఫిక్ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఆరుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డారన్నారు. వారిని న్యాయమూర్తి ప్రియాంక ఎదుట హాజరుపర్చగా విచారణ అనంతరం ఆరుగురికి రూ.3,500 జరిమానాతో పాటు ఒకరికి రెండు రోజులు జైలుశిక్ష విధించారని తెలిపారు. నిబంధనలు పాటించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు బ్యాంకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

సిద్దిపేటఎడ్యుకేషన్: తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో బ్యాంకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సునీత చెప్పారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలలో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 50 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి, 30 సంవత్సరాలోపు వారు అర్హులని, ఎంపికైన వారికి రూ.18 వేలకు పైగా వేతనం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో 12న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 81067 64653 నెంబరును సంప్రదించాలని సూచించారు.

డంపుయార్డును వినియోగంలోకి తెస్తాం

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాక: మున్సిపల్‌లోని లచ్చపేట వార్డులో నిర్మించిన డంప్‌యార్డు, డీఆర్‌సీ కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మంగళవారం మున్సిపల్ అధికారులతో కలిసి డంపుయార్డు, డీఆర్‌సీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో తడి, పొడిచెత్తను వేరు చేసి, తడిచెత్త ద్వారా సహజ ఎరువులు తయారు చేస్తామన్నారు. అందుకు అవసరమైన యంత్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ కనెక్షన్ పూర్తయ్యేలా చూడాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేరుచేసి వాహన సిబ్బందికి అందించాలని కోరారు. ఏఈ శ్రీకాంత్, ప్రవీణ్, దిలీప్ తదితరులు ఉన్నారు.



డీఆర్‌సీని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎస్‌ఎఫ్ఐ మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా 6వ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్ రెడ్డి, ప్రశాంత్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో మంగళవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21న సిద్దిపేటలో భారీ బహిరంగసభ ఉంటుందన్నారు. విద్యార్థులంతా పాల్గొనాలని కోరారు. మహాసభలో విద్యా రంగంలో జరుగుతున్న మార్పులు, సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రకటించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సంజుకుమార్, సభ్యులు ప్రవీణ్, అభిషేక్, భాను, సంతోష్ తదితరులు పాల్గొన్నారు,



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

స్థానిక ఎన్నికలకు సన్నద్ధంకండి

మద్దూరు(హుస్నాబాద్): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు కృషిచేయాలని అందుకోసం బీఆర్ఎస్ నాయకులు సన్నద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ అన్నారు. మండలంలోని రేబర్తి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు బాలనర్సయ్య, అంజయ్య, మానస, కొండయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు లింగారెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, గణేశ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.



నాయకులు, కార్యకర్తలతో సంతోష్‌కుమార్

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి నిర్వహించిన వాహన తనిఖీల్లో ఎనిమిది మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా మంగళవారం విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.15వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నేటి నుంచి ఉగ్ర నర్సింహస్వామి ఉత్సవాలు

చిన్నకోదూరు(సిద్దిపేట): మండల పరిధిలోని అల్లీపూర్ గుట్టల్లో వెలసిన ఉగ్ర నర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. బుధవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహణకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, స్వామి వారికి అభిషేకాలు, హోమాలు, బోనాలు తీయడం జరుగుతుంది. శుక్రవారం ఘనంగా కల్యాణం జరుపుతారని, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని ఆలయ నిర్వాహకుడు నాగరాజు తెలిపారు.



సంక్షిప్త వార్తలు

◆ **బస్సు సౌకర్యం కల్పించాలి**

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మసిరెడ్డితండాకు నంగునూర్ మండలం నుంచి గట్లమల్యాల మీదుగా మసిరెడ్డితండా వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మంగళవారం తండావాసులు, మాజీ వార్డు సభ్యుడు మాలోతు మోహన్‌నాయక్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గట్లమల్యాల గ్రామానికి మసిరెడ్డితండా గ్రామాల మధ్య సుమారు 2 కిలోమీటర్ల దూరం ఉంటుందని, బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారని మోహన్‌నాయక్ తెలిపారు.

◆ **నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

గజ్వేల్‌రూరల్: ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన సేవలందిస్తూ వారి అభిమానాలు పొందాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని అహ్మదీపూర్‌లోగల పీహెచ్‌సీని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీనివాస్, వైద్యులు ప్రణయ్‌రాజ్, మహరాజ్ బల్లా, సీహెచ్‌ఓ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **టీజీఐఐసీ చైర్ పర్సన్ పూజలు**

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గలోని విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ క్షేత్రం పవిత్రతకు, ప్రశాంతతకు నిలయంగా ఉందన్నారు. క్షేత్రం ఆవరణలోకి రాగానే ఒక అలౌకిక అనుభూతికి లోనయ్యానని చెప్పారు. అర్చకులు కృష్ణ, కిషోర్ పాండే నిర్మలను అమ్మవారి శ్వేత వస్త్రంతో సన్మానించారు. క్షేత్రం నిర్వహణపై చెప్పెల హరినాథ శర్మకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు లక్ష్మి, క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యుడు రవీందర్, నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.



◆ **నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు**

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎస్ఎల్ కాలనీలో పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం 14 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు నరసింహులు గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని బస్వాపూర్‌లో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు పరిశీలించి విద్యార్థులకు తరగతులను బోధించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి తెలుసుకోవడానికే తనిఖీ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మయ్య తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

అర్చకుడిపై దాడి సరికాదు

నారాయణఖేడ్: చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు స్వామిరంగరాజన్‌పై దాడి సరికాదని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరాం అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కావాలనే కొందరు రామరాజ్యం సంస్థగా పేరు పెట్టుకుని దాడి చేశారన్నారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి సతీశ్ కుమార్, నాయకులు ప్రవీణ్, లోకేశ్ స్వామి పాల్గొన్నారు.